# దుబ్బాక ప్రజలు సీఎం కేసీఆర్ వెంటే



మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన ఉప సర్పంచ్ ముక్కపల్లి కనకయ్య

- ఎమ్మెల్యే రఘునందన్‌రావు మాయమాటలకు మోసపోవద్దు
- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి
- బీఆర్‌ఎస్‌లో చేరిన మిరుదొడ్డి ఉప సర్పంచ్ కనకయ్య

మిరుదొడ్డి, అక్టోబర్ 12 : మాయమాటలు చెప్పుకుంటూ యువకులను ఎమ్మెల్యే రఘునందన్‌రావు బీజేపీలో చేర్చుకొని వారిని విస్మరిస్తున్నారని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఈ నెల 11న మిరుదొడ్డి టౌన్‌కు చెందిన బీఆర్‌ఎస్‌కు చెందిన ఉప సర్పంచ్ ముక్కపల్లి కనకయ్య ఎమ్మెల్యే రఘునందన్‌రావు సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ నెల 12న గురువారం మిరుదొడ్డి ఉపసర్పంచ్ తిరిగి తన సొంత గూటికి ఎంపీ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు, యువకులను ఎమ్మెల్యే మభ్య పెట్టి బీజేపీలో చేర్చుకునే ప్రయత్నం సరైంది కాదని మండి పడ్డారు. ఎమ్మెల్యే ఈ ఎన్నికల్లో ఎన్ని జిమ్మిక్కులు చేసినా దుబ్బాక ప్రజలు సీఎం కేసీఆర్ వైపు ఉన్నారని తెలిపారు. మిరుదొడ్డి టౌన్‌లోని శివాజీ విగ్రహం నుంచి హైస్కూల్ వరకు రోడ్డు పని అడగడానికి వెళ్తే ఎమ్మెల్యే తనకు బీజేపీ కండువా కప్పారని మిరుదొడ్డి ఉప సర్పంచ్ ముక్కపల్లి కనకయ్య అన్నారు. గురువారం తిరిగి బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. తన ప్రాణం ఉన్నంత వరకు బీఆర్‌ఎస్, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిని విడిచి పెట్టేది లేదన్నారు. పనికిరాని రాజకీయాలు చేయడం ఎమ్మెల్యే మానుకుంటే చాలా మంచిదని సూచించారు. కార్యక్రమంలో మిరుదొడ్డి టౌన్ సర్పంచ్ రంగమైన రాములు, ఏఎంసీ మాజీ చైర్మన్ నంట బాపురెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు తోట కమలాకర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



రాముని పట్లలో ఏకగ్రీవ తీర్మాన పత్రాన్ని సర్పంచ్ జేరిపోతుల శ్రీనివాస్‌కు అందజేస్తున్న మహిళా సంఘం సభ్యులు

# మంత్రి హరీశ్‌రావుకే మా ఓటు

**రామునిపట్ల మహిళా సంఘం ఏకగ్రీవ తీర్మానం**

చిన్నకోడూరు, అక్టోబర్ 12 : మంత్రి హరీశ్‌రావుకే మా సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని రామునిపట్ల మహిళా సంఘం సభ్యులు గురువారం ఏకగ్రీవ తీర్మానం చేశారు. తీర్మాన పత్రాన్ని సర్పంచ్ జేరిపోతుల శ్రీనివాస్‌కు అందజేశారు. మహిళా సంఘం సభ్యులు మాట్లాడుతూ.. మంత్రి హరీశ్‌రావును భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మంత్రి హరీశ్‌రావు ఆపద సమయంలో మనోధైర్యాన్ని నింపుతూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి అండగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ మండల అధ్యక్షుడు గుజ్జ రాజు, గ్రామ శాఖ అధ్యక్షుడు పంతం శ్రీనివాస్, మిట్టపల్లి గణేశ్, కట్కూరి శ్రీనివాస్, కర్రె రాజు, మహిళలు కనకవ్వ, రజిత, భాగవ్వ, శైలజ, లక్ష్మి కృప, పాల్గొన్నారు.

# ఆలయాల అభివృద్ధికి కృషి



ధర్మారంలో మహంకాళి దేవాలయం వద్ద ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మిరుదొడ్డి, అక్టోబర్ 12 : ఆలయాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషిచేస్తున్నారని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం ధర్మారం గ్రామంలోని మహంకాళిదేవి, బీరప్ప స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు దేవాలయాలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలోని దేవాలయాలకు ధూపదీప నైవేద్యం పథకంలో డబ్బులు అందిస్తున్నారని తెలిపారు. గొల్లకురుమ యాదవులకు ఆర్థికంగా ఆదుకోవాలనే సంకల్పంతోనే సబ్సిడీపై 21 గొర్రెపిల్లలను అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గజ్జల సాయిలు, జడ్పీటీసీ సూకురి లక్ష్మీలింగం, ఎంపీటీసీ శ్రీనివాస్, నాయకులు దుర్గారెడ్డి, మైసయ్య పాల్గొన్నారు.

# మల్లన్న ఆలయంలో హుండీల లెక్కింపు



నగదు లెక్కిస్తున్న శివరామకృష్ణ భజన మండలి సభ్యులు

**62రోజుల్లో ఆదాయం రూ.65,18,785**

చేర్యాల, అక్టోబర్ 12 : కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ హుండీలను మహా మండపంలో ఆలయ ఈవో బాలాజీ ఆధ్వర్యంలో దేవాదాయశాఖ సిద్దిపేట డివిజన్ ఇన్‌స్పెక్టర్ రంగారావు పర్యవేక్షణలో గురువారం లెక్కింపులు జరిగాయి. ఆలయంలోని 23 హుండీలకు ఆలయ అర్చకులు, ఉద్యోగులు, తాత్కాలిక సిబ్బంది, రాజన్నసిరిసిల్ల జిల్లాకు చెందిన శివరామకృష్ణ భజన మండలి సేవా సమితి సభ్యులతో లెక్కించారు. 62రోజుల్లో రూ.65,18,785 నగదు, 25గ్రాముల మిశ్రమ బంగారం, 4,500 గ్రాముల మిశ్రమ వెండి సమకూరింది. దీంతో పాటు 11విదేశీ కరెన్సీ నోట్లు, 1000 కిలోల మొక్కుబడి బియ్యం వచ్చింది. ఈ సందర్భంగా ఆలయంలో ఈవో విలేకరులతో మాట్లాడుతూ నగదును స్థానిక ఏపీజీవీబీలో జమ చేశామన్నారు. లెక్కింపులో ఏఈవో వైరాగ్యం అంజయ్య, పర్యవేక్షకుడు నీల శేఖర్, ఆలయ స్థానాచార్యుడు పడిగన్నగారి మల్లేశం, ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించాలి

- రాష్ట్ర పట్టు పరిశ్రమ శాఖ జాయింట్ డైరెక్టర్‌కు రైతుల వినతిపత్రం



జాయింట్ డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జిల్లా పట్టు రైతుల సంఘం నాయకులు

సిద్దిపేట కమాన్, అక్టోబర్ 12 : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా పట్టు రైతుల సంఘం ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లోని రాష్ట్ర పట్టు పరిశ్రమశాఖ కార్యాలయంలో పట్టు పరిశ్రమ శాఖ జాయింట్ డైరెక్టర్ లతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పట్టు రైతులు మాట్లాడుతూ 2018 నుంచి పెండింగ్‌లో ఉన్న ఇన్సెంటివ్ వచ్చేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సికింద్రాబాద్‌లోని తిరుమలగిరి, జనగామ మార్కెట్లలో పట్టుగూళ్లు అమ్మిన రైతులకు సుమారు 15 రోజుల నుంచి డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, అమ్మిన వెంటనే డబ్బులు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. పట్టు సాగుకు అవసరమయ్యే మందులు సబ్సిడీపై ఇవ్వాలని కోరారు. ఈ విషయమై జాయింట్ డైరెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు రైతులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పట్టు రైతుల సంఘం అధ్యక్షుడు పెద్దోల్ల ఐలయ్య, ఉపాధ్యక్షుడు పీఎస్ యాదగిరి, సహాయ కార్యదర్శి దేవయ్య, కోశాధికారి రాగుల రాజు, కార్యవర్గ సభ్యులు బి.అంజనేయులు, బి.నర్సింహులు, సంతోష్‌రెడ్డి, రైతులు ఉన్నారు.

# గజ్వేల్‌లో జాతీయస్థాయి ఎన్‌సీసీ శిక్షణ శిబిరం

**గజ్వేల్‌కు చేరుకున్న వివిధ రాష్ట్రాల ఎన్‌సీసీ కెడెట్లు**

గజ్వేల్ అర్బన్, అక్టోబర్ 12 : గజ్వేల్ బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ప్రత్యేక ఎన్‌సీసీ శిబిరానికి గురువారం వివిధ రాష్ట్రాల నుంచి ఎన్‌సీసీ కెడెట్లు చేరుకున్నట్లు క్యాంపు కమాండెంట్ కల్నల్ సునీల్ అబ్రహం తెలిపారు. తెలంగాణతోపాటు జమ్మూ కశ్మీర్, లఢక్, బీహార్, జార్ఖండ్, రాజస్థాన్, పశ్చిమబెంగాల్, తమిళనాడు, అండమాన్ నికోబార్, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, గోవా, ఢిల్లీ, గుజరాత్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఉత్తరప్రదేశ్, సిక్కిం, కేరళ, లక్షద్వీప్ రాష్ట్రాల నుంచి ఎన్‌సీసీ క్యాంపుకు కెడెట్లు హాజరయ్యారన్నారు. వీరిలో సీనియర్ డివిజన్, సీనియర్ వింగ్‌కు చెందిన కెడెట్లు, ప్రతీ రాష్ట్రం నుంచి ఇద్దరు ఎన్‌సీసీ అధికారులు వచ్చినట్లు క్యాంపు డిప్యూటీ కమాండర్ కల్నల్ పీఎస్ నందా తెలిపారు. క్యాంపు శిక్షణ నిర్వహణకు సంగారెడ్డి బెటాలియన్ నుంచి సుబేదార్ మేజర్ సురేందర్ గురుంగ్, సుబేదార్ శివశంకర్, లెఫ్టినెంట్ భవాని, మనోజ్ పాల్గొన్నారు.



గజ్వేల్ ఎడ్యుకేషన్ హబ్‌కు చేరుకున్న ఎన్‌సీసీ కెడెట్లు

# సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి



గజ్వేల్‌లో విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న సిద్దిపేట సీపీ శ్వేత

గజ్వేల్, అక్టోబర్ 12 : విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని, పుస్తకాలతోనే ఎక్కువ సమయం గడపాలని సీపీ శ్వేత అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్ సెయింట్ మేరీస్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. సెల్‌ఫోన్ వాడకంతో విలువైన సమయం తెలియదన్నారు. సోషల్ మీడియాకు ఎంత దూరంగా ఉంటే భవిష్యత్ అంత బాగుంటుందన్నారు. బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. మహిళలు సమాజంలో మగవారితో పోటీపడి ఉద్యోగాలు సాధించాలన్నారు. చెడు అలవాట్లకు బానిస కావొద్దన్నారు. అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని, వారి ఫోన్‌కాల్స్, మాటలు నమ్మొద్దన్నారు. కార్యక్రమంలో ఏసీపీ రమేశ్, సీఐ జాన్‌రెడ్డి, కరస్పాండెంట్ ఇన్నారెడ్డి పాల్గొన్నారు.